క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కుమ్మర వీధిలోని చెత్త తొట్టి వద్ద బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

కమలాపురం : పట్టణంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. కమిషనర్ ప్రహ్లాద పర్యవేక్షణలో స్వచ్ఛతా హీ సేవ–2025 (స్వచ్ఛోత్సవ్)లో భాగంగా పట్టణంలోని కుమ్మర వీధి, మార్కెట్ వీధి, బీడీ కాలనీ, మారుతినగర్, కృష్ణానగర్, రామ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న చెత్త కుండీల వద్ద చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోనే చెత్తను ఉంచితే మున్సిపల్ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి తీసుకెళ్తారని తెలిపారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే రోగాలు దరి చేరకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన కుళ్లాయిప్పతో ఉపాధ్యాయులు

పులివెందుల రూరల్ : జిల్లాస్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు నలబద్దపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న శివకుళాయప్ప ఎంపికయ్యారు. ఈనెల 20వ తేదీన కర్నూల్ జిల్లాలో జరిగిన హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గోవర్దన్ తెలిపారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేములలో గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

వేముల : వేములలో శనివారం మన గ్రోమోర్ జోనల్ మార్కెటింగ్ సెంటర్‌ను డైరెక్టర్ చక్రధర్ ప్రారంభించి మట్లాడారు. మన గ్రోమోర్ సెంటర్‌లో అన్ని రకాల ఎరువులతోపాటు క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు సాగుచేసుకుంటున్న అరటి, చీనీ, టమాట వంటి సాగుచేసే రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చారు. మండల వ్యాప్తంగా రైతులకు మన గ్రోమోరు అందుబాటులో ఉందని.. రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ గంగయ్య, రైతులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గాయి.. రోడ్డుపై గుంతలు మిగిలాయి



ఎర్రగుంట్ల- ప్రొద్దుటూరు రోడ్డుపై పడిన గుంతలు

ఎర్రగుంట్ల : ఇటీవల కురిసిన భారీ వర్షాలు తగ్గాయి. రోడ్డుపైన భారీ గుంతులు మాత్రం మిగిలాయి. ఎర్రగుంట్ల–ప్రొద్దుటూరు మార్గల మధ్య రోడ్డంత వర్షం నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. దీంతో రోడ్డుపైన భారీ గుంతుల ఏర్పడ్డాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎర్రగుంట్ల– ప్రొద్దుటూరు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. వర్షాలు పడటంతో రోడ్డుపైన వేసిన ప్యాచ్‌లన్నీ కొట్టుకు పోవడంతో నాణ్యత ఎలాంటిదో తెలుసుకోవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రమాదాలు జరగక ముందే రోడ్డుపైన పడిన భారీ గుంతలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు

స్త్రీ శక్తి యాప్‌పై అవగాహన

రాజుపాళెం : మహిళలంతా అత్యవసర పరిస్థితుల్లో స్త్రీ శక్తి యాప్‌ను ఉపయోగించుకోవాలని రాజుపాళెం ఎస్ఐ కె.వెంకటరమణ పేర్కొన్నారు. మండల కేంద్రమైన రాజుపాళెంలోని వెలుగు కార్యాలయంలో మహిళల భద్రత, డ్రగ్స్, స్త్రీ శక్తి యాప్, జీఎస్టీపై మహిళలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా డ్రగ్స్ వాడుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే ప్రతి ఒక్క మహిళ వారిపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మహిళలకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షాకీర్ అలీఖాన్, కొత్రపాడు పశువైద్యాధికారి లక్ష్మిదేవి, వెలుగు ఏపీఎం సుజాత, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఏరియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రబీలో పెరగనున్న పంటల సాగు విస్తీర్ణం

- ఈ ఏడాది అదునులో పంటలు సాగుతాయనే అంచనా
- రబీలో అన్ని రకాల పంటల సాగుపై దృష్టి
- నియోజకవర్గంలో 60వేల ఎకరాలకుపైనే సాగు



వ్యవసాయ బోర్ల కింద మినుము సాగు చేస్తున్న రైతులు

మంజూరైన సబ్సిడీ విత్తనాల వివరాలు				
మండలం	బుడ్డశనగ క్వింటాళ్లు	మినుము క్వింటాళ్లు	వేరుశనగ క్వింటాళ్లు	పెసర క్వింటాళ్లు
పులివెందుల	500	5	40	05
వేముల	1400	25	150	10
వేంపల్లె	1000	35	110	20
తొండూరు	1200	20	250	5
సింహాద్రిపురం	2700	20	180	15
లింగాల	1100	-	90	-
చక్రాయపేట			-	240

వేముల : ఈ ఏడాది రబీలో పంటల సాగు విస్తీర్ణం పెరగనుంది. వచ్చేనెల నుంచే రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఇందుకోసం రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలులేక పంటలు సాగు కాలేదు. దీంతో పొలాలన్ని బీళ్లుగా ఉన్నాయి. అరకొర వర్షాలతో రైతులు పంటల సాగుకు వెనుకంజ వేశారు. ఆలస్యంగా వర్షాలు కురిసినా భూములు పదున్లు కాలేదు. దీంతో ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమైనా సకాలంలో వర్షాలు లేకపోవడంతో పంటలు సాగు కాలేదు.

ఈ ఏడాది అదునులో సాగవుతాయనే అంచనా

రబీలో పంటలు సకాలంలో సాగవుతాయనే ఆశ రైతులలో బలంగా ఉంది. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే భారీ వర్షాలతో భూములు పదున్లు అయ్యాయి. అయితే ఇప్పుడే పంటలు సాగు చేసే అనంతరం వర్షాలు కురిస్తే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో అక్టోబరు మొదటి వారంలో పంటలు సాగు చేసందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం ఎరువులను, విత్తనాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈనెల చివరిలో తుఫాన్ ఏర్పడి వర్షాలు కురిసి భూములు పదున్లు అయితే అక్టోబరు నెల నుంచి పంటల సాగుకు రైతులు ఉపక్రమించనున్నారు.

సాగులో పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు

రబీ సాగులో పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగిపోతున్నాయి. రైతులు రసాయనిక ఎరువులు వాడకంలో పంటలు సాగు చేస్తున్నారు. దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. ఎరువుల ధరలు, సేద్యపు ఖర్చులు, విత్తనాల ధరలు పెరిగాయి. ఏ పంట సాగు చేయాలన్న ఎకరాకు రూ.15వేలు పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. పంటలు సాగు చేశాక కలుపు తీత పనులు, తెగుళ్ల నివారణకు మందులు స్ప్రే చేయడం ద్వారా ఖర్చులు పెరిగిపోతున్నాయి.

రబీలో పెరగనున్న సాగు విస్తీర్ణం

ఈ ఏడాది రబీ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఖరీఫ్‌లో వర్షాభావంతో పంటలు లేక పొలాలన్ని బీళ్లుగా ఉన్నాయి. రబీకి మొత్తం వ్యవసాయ పొలం అంతా పంటల సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఖరీఫ్‌లో పంటల సాగు చేస్తే ఆ పొలంలో తదుపరి పంటను రైతులు సాగు చేసేవారు కాదు. అయితే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు కాకపోవడంతో రబీలో సాగు విస్తీర్ణం పెరుగుతుందనే అంచనా ఉంది. గత ఏడాది 50వేల ఎకరాలలో పంటలు సాగైతే. ఈ ఏడాది 20 శాతం పంటలు సాగు పెరుగుతందనేది వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది.

నియోజకవర్గంలో 60వేల ఎకరాలకుపైనే సాగు

ఈ ఏడాది రబీలో 60వేల ఎకరాలకుపైనే పంటలు సాగవుతాయనే అంచనా ఉంది. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రకాల పంటలు కలుపుకుని సాగవుతాయి. నియోజకవర్గంలో శనగ పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతుంది. అయితే మినుము పంట తర్వాత స్థానంలో సాగవుతుంది. పెసర, కంది, రబీ నువ్వులు, వేరుశనగ పంటలు సాగవుతున్నాయి. ఇప్పటికే వ్యవసాయ బోర్లు, బావుల కింద మినుము పంట సాగైంది. అంతేకాక తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడి పొలాలు పదున్లు కావడంతో బోర్ల కింద ఈనెలలోనే మినుము పంటను రైతులు సాగు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు



అమరావతి(ఫైల్)

ఎర్రగుంట్ల: మండలంలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన అమరావతి(60) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మతిస్థిమితం బాగా లేక ఈ నెల 25న అమరావతి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. చుట్టుపక్కల విచారించినా ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె కుమారుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పిల్లల కోసం తల్లి పోరాటం

కడప కోటిరెడ్డిసర్కిల్ : వైఎస్సార్ జిల్లా మైదుకూరు–వనిపెంట రోడ్డులోని విజయనగర కాలనీకి చెందిన అక్కిదాసరి ఓబులమ్మ, భర్త చిట్టిబాబులకు 2008లో వివాహమైంది. వీరికి ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే చిట్టిబాబు నాలుగు నెలల కిందట మహిళను వివాహం చేసుకుని కమలాపురం మండలం ఎల్లారెడ్డిపల్లెలో ఉంటున్నాడు. ఈమె ఐదుగురు పిల్లలను తీసుకుని హైదరాబాదుకు వెళ్లింది. అక్కడ ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. బస్టాండు పక్కన ఓ షెల్టర్‌లో తలదాచుకుంటోంది. ఈ విషయం ఓ పత్రికలో వార్త ప్రచురించడంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పందించి ఐసీడీఎస్ అధికారి రమాదేవిని మైదుకూరుకు వెళ్లి ఈ విషయంపై ఆరా తీయాలని సూచించారు. అలాగే ఆమెకు ఉపాధి కల్పించాలని, అలాగే పిల్లలకు తల్లికి వందనం పథకం అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈ విషయంగా ఐసీడీఎస్ పీడీ రమాదేవి, డీసీపీఓ సుభాష్ యాదవ్‌కు ఓబులమ్మ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.

మండల సమగ్రాభివృద్ధికి సహకరించండి

పెండ్లిమర్రి : మండల సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఎంపీపీ ఎం.వరలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో శనివారం ఎంపీపీ మాచునూరు వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైయి వర్షాలు కురుస్తున్నాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మండలస్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

లక్ష్యాలను త్వరగా పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి

పులివెందుల రూరల్ : డ్రిప్పులకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వారిగా ఇచ్చిన లక్ష్యాలను త్వరగా పూర్తిచేయాలని ఏపీ ఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని మండల సభా భవనంలో ఉద్యానశాఖ సూక్ష్మ నీటి సాగు పథకం ఆధ్వర్యంలో పులివెందుల, లింగాల, వేముల మండలాలలో పనిచేస్తున్న రైతు సేవా కేంద్రం సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐదు ఎకరాల్లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% రాయితీతో రూ.2,18,000 వరకు, అలాగే చిన్న సంఘ రైతులకు 90% సబ్సిడీతో రూ.2,18,000 వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐదు ఎకరాల నుంచి పది ఎకరాలు పైన ఉన్న రైతులకు 50% రాయితీతో రూ.4 లక్షల వరకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్, ఇంజనీర్ శ్రీనివాసులు, ఉద్యానాధికారి రాఘవేంద్రారెడ్డి, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్టు కార్డుల పంపిణీ

జమ్మలమడుగు : మండల పరిధిలోని ప్రజలకు ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల స్థానంలో స్మార్టు రేషన్ కార్డులను పంపిణీ జరుగుతోందని తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషన్ కార్డుల పంపిణీ చేస్తారని ఎవ్వైనా సమస్యలుంటే వెంటనే వీఆర్వోలకు తెలపాలన్నారు.

జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, డ్రగ్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాజ్యలక్ష్మీ



పులివెందులలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రాముడు

కమలాపురం : స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్‌పై వీఓఏలకు డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల సమాఖ్య పరిధిలోని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులకు సమావేశాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ గురించి అవగాహన కల్పించాలన్నారు. సీఐ ఎస్‌కే రోషన్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌస్ బాషా, ఏపీఎం గంగాధర్, సీసీలు, వీఓఏలు, ఈసీ మెంబర్స్ పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో మెప్మా సిబందికి జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాముడు జీఎస్టీ గురించి మాట్లాడుతూ గతంలో రోజువారి ఉపయోగించే చాలా వస్తువులపై 18 శాతం ఉన్న జీఎస్టీ ఇప్పుడు 5 శాతం అయిందన్నారు. ఈ విషయాన్ని స్వయం సహాయక సంఘాలతో మీటింగ్ పెట్టి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ సీతారామిరెడ్డి, ఏసీటీఓ స్వర్ణాం, మెప్మా సీఎంఎం నాగలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం యానిమేటర్లు, సీసీలు, గ్రామ సమాఖ్య సభ్యులకు జీఎస్టీ, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై వెలుగు ఏపీఎం భాగ్యమ అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్ పాల్గొని మాట్లాడారు. గతంలో ఉన్న జీఎస్టీ ప్రజలకు చాలా భారంగా ఉండేదని ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై చేసిన సవరణతో చాలా వరకు ధరలు తగ్గుతాయన్నారు. పోలీసు అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు ఒంటరిగా ఉన్నప్పుడు, ప్రయాణం చేసేటప్పుడు వారి భద్రత కోసం శక్తి యాప్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ యాప్ ద్వారా ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు వీలుంటుందన్నారు. 181 హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేశామన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో జీఎస్టీకి సంబంధించిన సమాచారం, నూతన జీఎస్టీ విధానాల వలన కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై ఎంపీడీఓ కుళ్లాయిబాబు అవగాహన కల్పించారు. అలాగే మాదక ద్రవ్యాలు–మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. వెలుగు ఏపీఎం వెంకటరమణరాజు, వీఓఏలు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : సూపర్ జీఎస్టీ అమలుతో ధరలు తగ్గి పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబుల్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల మహిళ సమాఖ్యలో జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, మహిళల భద్రత, మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ దస్తగిరి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నివారణకు మహిళాశక్తి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకృష్ణాదేవి, ఏపీఎం అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎంపీడీఓ నాగప్రసాదు, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మహిళల భద్రత కోసం ఉన్న శక్తి యాప్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మహిళల భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ యాప్‌లో రాష్ట్రంలోని పోలీస్ అధికారుల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. మున్సిపల్ కమిషనర్ శేషఫణి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో రేట్లు తగ్గుతాయన్నారు. అలాగే స్థానిక వెలుగు కార్యాలయంలో మత్తు పదార్థాలు వినియోగిస్తే వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణయ్య, వెలుగు ఏపీఓ జగదీశ్వరి, మహిళలు పాల్గొన్నారు.

జగజ్జననీ.. నమోస్తుతే



పులివెందుల : పార్వతీదేవి అలంకారంలో అంకాలమ్మతల్లి



చెన్నూరు : చౌడేశ్వరీ మాత సన్నిధిలో వైఎస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథరెడ్డి



పులివెందుల : అన్నపూర్ణాదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



వేముల : అన్నపూర్ణాదేవి అలంకారంలో నల్లనమ్మ



సింహాద్రిపురం : శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు



వీరపునాయునిపల్లె : భవానీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన తలపనూరు గంగమ్మతల్లి

పులివెందుల టౌన్ : దసరా ఉత్సవాలలో భాగంగా పట్టణంలో వెలసిన అమ్మవారిశాలలో శనివారం వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు శ్రీపార్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్, ఈఓ రమణలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటరమణుడి ఆలయంలో స్వామివారు శ్రీవైకుంఠవాసుని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వేములలో..

వేముల : గొల్లలగూడూరులోని నల్లనమ్మ అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : పాతూరులో అమ్మవారు శ్రీలలితా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు.

వీరపునాయునిపల్లెలో

వీరపునాయునిపల్లె : తలపనూరు గంగమ్మతల్లి శ్రీభవానిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా సంగమేశ్వరాలయంలో పార్వతీదేవి కాత్యాయనీదేవిగా, గడ్డంవారిపల్లె రాజరాజేశ్వరీ దేవి లలితా త్రిపురుందరీదేవిగా, ఉరుటూరు చౌడమ్మతల్లి, అనిమెల బోగాదమ్మ తల్లి మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని కీర్తిపల్లె నల్లనమ్మ లక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

కమలాపురంలో..

కమలాపురం : పట్టణంలోని అమ్మవారిశాలలో శ్రీ మత్కన్యకాపరమేశ్వరీ దేవీ లక్ష్మీ వెంకటేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో రాత్రి లక్కిడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

కొండాపురంలో..

కొండాపురం : దత్తాపురం గ్రామంలోని శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయంలో లలితా త్రిపురసుందరీదేవి అంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎర్రగుంట్లలో

ఎర్రగుంట్ల : పట్టణంలోని కన్యకాపరమేశ్వరిదేవి ఆలంయలో శ్రీ గజలక్ష్మీదేవి అలంకరణలో, శ్రీ ఏరువాక గంగమ్మతల్లి దేవాలయంలో శ్రీ పార్వతీదేవి అలంకరణలో, నడివూరులో శ్రీ పార్వతీదేవి అలంకరణలో అంకమ్మతల్లి భక్తులకు దర్శనమిచ్చారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : కన్యతీర్థంలో వైష్ణవీదేవి అలంకరణలో శ్రీ బాలత్రిపుర సుందరీదేవి భక్తులకు దర్శనం ఇచ్చారు. నిర్వాహకులు అమ్మవారికి పూజలను నిర్వహించారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో లలిత త్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శినమించారు. ఆలయ ఈఓ కృష్ణానాయక్, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక శ్రీవాసవీ ఆర్యవైశ్య కల్యాణ భవనంలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించా రు. దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి లలి తా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

చెన్నూరులో..

వల్లూరు(చెన్నూరు) : స్థానిక శ్రీ రామలింగ చౌడేశ్వరి మాత ఆలయంలో వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో చెన్నూరు మండల వైఎస్ఆర్‌సీపీ నేతలు పాల్గొన్నారు.



కమలాపురం : లక్ష్మీవెంకటేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు



కొండాపురం : లలితా త్రిపురసుందరిదేవి అలంకణలో పెద్దమ్మతల్లి



ఎర్రగుంట్ల : పార్వతీదేవి అలంకరణలో అంకమ్మతల్లి



జమ్మలమడుగు : వైష్ణవీ దేవి అలంకరణలో అమ్మవారు



పొలతలలో లలిత త్రిపురసుందరిదేవి అలంకరణలో అమ్మవారు



వల్లూరు : దుగ్గాయపల్లెలో శ్రీలలితా త్రిపుర సుందరిదేవి అలంకారంలో చౌడేశ్వరి మాత